



27 ఏళ్ల కిందట శిరోముండనానికి గురైన బాధితులు (ఫైల్)

కోర్టు తీర్పుతో దళితులకు న్యాయం



శిరోముండనం కేసులో నిందితులకు 18 నెలల జైలు శిక్ష విధించడంతో కోర్టుపై చాలా నమ్మకం కలిగింది. ఈ కేసులో న్యాయం కోసం 28 ఏళ్లుగా ఎదురు చూశాం. కోర్టు తీర్పుతోదళితులకు న్యాయం జరిగింది. - **కనికెళ్ల గణపతి, బాధితుడు**

27 ఏళ్లు కోర్టుల చుట్టూ తిరిగాం



27 ఏళ్లుగా కోర్టుల చుట్టూ తిరిగాం. ముద్దాయిలకు ఎట్టకేలకు శిక్ష ఖరారు చేయడంతో సంతోషంగా ఉన్నా. మిగిలిన బాధితులు, నాయకులతో కలిసి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటాం.- **చల్లపూడి పట్టాభి, బాధితుడు**


కేసు నిలిపిన ఘనత బొజ్జా తారకానిదే



పుట్టుస్వామి కమిషన్ నివేదికతో అప్పటి ప్రభుత్వం శిరోముండనం కేసు ఎత్తివేసింది. హైకోర్టు న్యాయవాది బొజ్జా తారకం మాండమస్ రిట్ వేసి కేసు విచారణ పునఃప్రారంభించేలా చేశారు. **-వి.భీమశంకరం, దళిత ఐక్య పోరాట వేదిక కన్వీనర్**

వివాదాల తోటలో..

ధర్మమే గెలిచింది!



తోట త్రిమూర్తులు, మండపేట వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి

శిరోముండనం కేసులో 27 ఏళ్ల తర్వాత జైలు శిక్ష

- మండపేట వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులు సహా 9 మందికి శిక్ష
- 18 నెలలు తక్కువ శిక్షపై ఆవేదన
- మళ్లీ పోరాడతామంటున్న బాధితులు
- వెంకటాయపాలెంలో హర్షం
- మూడేళ్ల కిందట వైసీపీ ఎంపీ బోస్ ఫిర్యాదు
- నాడు చర్చనీయాంశమైన అంశం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఒకటికాదు రెండు కాదు.. ఏకంగా 27 ఏళ్ల పైమాటే.. న్యాయం కోసం తిరగని కోర్టు లేదు.. ఎట్టకేలకు సుదీర్ఘ నిరీక్షణ ఫలించింది. శిరోముండనం నిందితులకు శిక్ష ఖాయమైంది. కానీ తీర్పు వచ్చిన ఆనందంకంటే తమకు అసలైన న్యాయం జరుగుతుందని ఇన్నేళ్లు నిరీక్షించిన క్షణాలకు విలువ లేకుండా పోయిందని ఆ బాధితులు వాపోతున్నారు. న్యాయం కోసం 27 ఏళ్ల కళ్లుకాయలు కాసేలా ఎదురుచూసి మానసిక క్షోభతో శిక్ష అనుభవిస్తే నిందితులకు కేవలం 18 నెలలే జైలుశిక్ష పడడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్నేళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తగిన న్యాయం కోసం మళ్లీ పోరాటం చేస్తామని చెప్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం శిరోముండనం కేసు తీర్పు జిల్లాలో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కేసులో తీర్పు రావడానికి ఇన్నేళ్ల నిరీక్షణకు కారణాలేమిటనే చర్చ జరుగుతోంది.

అప్పట్లో పెను సంచలనమై..

రామచంద్రపురం నియోజకవర్గానికి 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన తోట త్రిమూర్తులు ఎమ్మెల్యేగా నెగ్గారు. ఆ ఎన్నికల్లో అదే మండలం వెంకటాయపాలేనికి చెందిన ఐదుగురు దళిత యువకులు, త్రిమూర్తులు మధ్య రాజకీయ విబేధాలు తలెత్తాయి. ఈ క్రమంలో ఐదుగురు దళిత యువకులను చిత్రహింసలకు గురిచేసి ఇద్దరికి శిరోముండనం చేయించారు. ఒక ఎమ్మెల్యే ఇలా దళితులను అవమానించడంపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. దీంతో అప్పట్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ ఆదిత్య త్రిపాఠి నేరుగా వెంకటాయపాలెం వెళ్లి విచారణ చేపట్టి 1997 జనవరి 4న ద్రాక్షారామ పోలీస్‌స్టేషన్‌లో క్రైం నెం.1/1997 కింద ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. మొత్తం 10 మందిని నిందితులుగా గుర్తించగా.. నాడు ఎమ్మెల్యేగా ఉన్న తోట త్రిమూర్తులును ఏ1గా నిర్ధారించారు. జనవరి 7న త్రిమూర్తులును పోలీసులు అరెస్టు చేశారు. జనవరి 18న కోర్టులో పోలీసులు చార్జిషీటు దాఖలు చేయగా న్యాయస్థానం ఆదేశాల మేరకు 87 రోజుల పాటు త్రిమూర్తులుతో పాటు మరికొందరు సహ నిందితులను రాజమండ్రి సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు తరలించారు. ఆ తర్వాత వీరు బెయిల్‌పై విడుదలయ్యారు. 1997 అక్టోబరు 15న కేసును రాజమండ్రి నుంచి విశాఖలోని ప్రత్యేక న్యాయస్థానానికి బదిలీ చేశారు. పుట్టుస్వామి కమిషన్ రంగంలోకి దిగి 1998లో కేసు విచారణ చేపట్టింది. కమిషన్ నివేదిక ఆధారంగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కేసును ఉపసంహరించుకుంటూ జీవో జారీ చేసింది. దీనికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా దళిత సంఘాలు ఆందోళనలకు దిగాయి. అప్పట్లో న్యాయవాది బొజ్జా తారకం తదితరులు హైకోర్టును ఆశ్రయించగా కేసు మళ్లీ విచారణ మొదలైంది. నిందితులు 2006లో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. బాధితులు దళితులు కాదని, బీసీ వర్గం కిందకు వస్తారంటూ ఫిర్యాదులు వచ్చాయి. అయితే ఇవేవీ న్యాయస్థానాల్లో నిలబడలేదు. ఈ కేసులో 2020లో వైసీపీ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మధ్య వివాదాలు చోటుచేసుకున్నాయి. శిరోముండనం కేసుపై 2020 నవంబరులో ఎంపీ బోస్ రాష్ట్ర హోంమంత్రికి లేఖ రాయడం కలకలం రేపింది. ఎన్నో ఏళ్ల కిందట జరిగిన శిరోముండనం కేసులో విచారణను వేగవంతం చేయాలని ఆ లేఖలో అప్పట్లో బోస్ డిమాండ్ చేశారు. దళితులకు అన్యాయం చేసిన నేపథ్యంలో సొంత పార్టీ అయినా సరే త్రిమూర్తులును వదిలిపెట్టేది లేదని అప్పట్లో పేర్కొన్నారు. తాజా తీర్పు పైనా బోస్ స్పందించారు. పూర్తి తీర్పు చదివిన తర్వాత ఏం చేయాలో నిర్ణయిస్తానన్నారు.

జగన్ పాలనలో దళితులకు రక్షణేది..

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో దళితులకు రక్షణ లేకుండా పోయింది. ఒక పక్క నా ఎస్సీలు అంటూనే జగన్ ప్రభుత్వం దళితులను నిలువునా మోసం చేసి రోడ్డున పడేస్తే.. ఆ పార్టీ నేతలు ఎక్కడికక్కడ వారిపై దాడులు, హత్యలకు తెగబడ్డారు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణలే కాకినాడలో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ హత్య ఘటన. 2022 మే 18న తన వద్ద పనిచేస్తున్న కారు డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు అర్ధరాత్రి కాకినాడ బీచ్ రోడ్డులో హత్య చేసి మరునాడు మృతదేహాన్ని స్వయంగా తన కారులో అనంతబాబు డ్రైవర్ ఇంటికే తీసుకువచ్చాడు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గంలోని సీతానగరంలో వరప్రసాద్ అనే దళిత యువకుడికి పోలీస్ స్టేషన్‌లోనే కొందరు వైసీపీ నేతలు శిరోముండనం చేశారు. 2022 జనవరిలో కాకినాడ జిల్లా సామర్లకోటలో పోలీసుల వేధింపులు తాళలేక దళిత యువకుడు గిరీష్‌బాబు ఆత్మహత్య చేసుకున్నాడు. కాకినాడ జిల్లా తొండంగి మండలంలో జాతరలో రెండు సామాజిక వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో దళిత యువకుడు రాము మృతి చెందాడు. కోడికత్తి కేసులో దళిత యువకుడు శ్రీను జైలుపాలయ్యాడు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలోని మలకపల్లిలో దళిత యువకుడి హత్య, దొమ్మేరులో వైసీపీ నేతల ఒత్తిడితో దళిత యువకుడి ఆత్మహత్య జరిగాయి. ఇలా అనేక మంది దళిత యువకులు అధికార పార్టీ అరాచకాలకు బలయ్యారు.

ఇన్నేళ్లలో 10 మందికిపైగానే మృతి...

27 ఏళ్ల పాటు సుదీర్ఘంగా కొనసాగిన కేసులో బాధితులు, సాక్షుల్లో అనేక మంది చనిపోయారు. కేసులో మొత్తం 24 మంది సాక్షులుగా ఉండగా వీరిలో 10 మంది చనిపోయారు. బాధితుల్లో ఒకరు, ముద్దాయిల్లో ఒకరు చనిపోయారు. అయితే 2019 నాటికి ఈ కేసు 146సార్లు వాయిదా పడింది. 27 ఏళ్లు దాటినా తీర్పు రాకపోవడంతో బాధితుల్లో నిరాశ ఆవహించింది. అయినా పట్టు వదల్లేదు. ఎట్టకేలకు తీర్పు వచ్చినా నిందితుడైన వైసీపీ ఎమ్మెల్సీ, అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రస్తుత మండపేట వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులుకు విధించిన శిక్ష చాలా చిన్నదని బాధితులు వాపోయారు. 27 ఏళ్ల పాటు తీర్పు ఇవ్వకుండా నిందితుడికి 18 నెలల జైలుశిక్ష విధించిందని మంగళవారం రామచంద్రపురంలో బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

దళిత వ్యతిరేకులకు సీట్లా?

ముప్పాళ్ల సుబ్బారావు, న్యాయవాది



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దళితులకు శిరోముండనం చేసిన తోట త్రిమూర్తులుకు మండపేట నుంచి అధికార వైసీపీ సీటు ఖరారు చేసిందని.. కోర్టు తీర్పు నేపథ్యంలో దళిత వ్యతిరేకులను వైసీపీ పోటీకి నిలుపుతుందా? లేక అభ్యర్థిని మారుస్తుందా? అని ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు ప్రశ్నించారు. దళితులకు అనుకూలమని చెప్పుకునే జగన్ తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.



శిక్ష సరిపోదు.. పోరాడతాం!

దళిత ఐక్య వేదిక సంఘం నాయకులు

శిరోముండనం కేసులో తీర్పుపై హైకోర్టులో పోరాటం చేస్తామని దళిత ఐక్య వేదిక ప్రకటించింది. రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం శివారు వీరేశగుళ్ల కాలనీలోని గుర్రాల పరంజ్యోతి స్మారక గ్రంథాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 27 ఏళ్లుగా న్యాయం కోసం ఎదురు చూస్తున్న బాధితులు, దళితులకు కోర్టు తీర్పు నిరాశ కలిగించిందన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ, మండపేట వైసీపీ అభ్యర్థిగా ఉన్న తోట త్రిమూర్తులును కోర్టు దోషిగా ప్రకటించిందని.. జగన్ ప్రభుత్వం ఏమి సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వానికి దగాపడ్డ దళితులే తీర్పు చెబుతారన్నారు. నిందితులకు 18 నెలల జైలు, జరిమానా విధించడం.... వెంటనే బెయిల్ మంజూరు చేయడం చూస్తుంటే బాధితులకు నష్టం కలిగినట్టు ఉందన్నారు. తదుపరి కార్యాచరణ నిర్దేశించుకుని న్యాయపరమైన ప్రక్రియలో ముందుకు సాగుతామని తెలిపారు. సమావేశంలో దళిత ఐక్య వేదిక సహ కన్వీనర్ చీకట్ల వెంకటేశ్వరరావు, శిరోముండనం బాధితుడు కోటి చినరాజు, దళిత ఐక్య వేదిక నాయకులు గుబ్బల శ్రీను, వెంటపల్లి రామకృష్ణ, రేవు నాగేశ్వరరావు, బి.సిద్ధు, అంబటి కృష్ణ, సాదే రాజేష్ మేడిశెట్టి ఇజ్రాయిల్, చిన్న పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థ పరిపుష్టికి ఓటు కీలకం: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.నివాస్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 16: ప్రజాస్వామ్య వ్యవస్థ పరిపుష్టికి, బలోపేతానికి ప్రతిఒక్క ఓటు అత్యంత కీలకమని కలెక్టర్ జె.నివాస్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన సోషల్‌మీడియా, యూట్యూబ్ చానల్స్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న జరిగే పోలింగ్‌లో ఓటు ఉన్న ప్రతిఒక్కరూ పాల్గొనాలన్నారు. కొత్తగా ఓటు నమోదు చేసుకున్న యువత తప్పనిసరిగా ఓటువేయాలన్నారు. ప్రస్తుతం చాలామంది సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానల్స్‌ను అనుసరిస్తున్నందున దీనిద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. కాకినాడ జిల్లా భౌగోళిక పరిస్థితులు, ఇతర వనరులను దృష్టిలో ఉంచుకుని ఓటర్లను చైతన్యపరుస్తూ వినూత్నంగా వీడియోలు రూపొందించాలన్నారు. జిల్లాలో పోలింగ్ శాతం పెంచేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. స్వీప్ జిల్లా నోడల్ అధికారులు విజయ్ భాస్కర్, భాను ప్రకాష్, సోషల్‌మీడియా, యూట్యూబ్ ఛానల్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అభ్యర్థుల రోజువారీ వ్యయాన్ని లెక్కించాలి

- ఎన్నికల వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి భరణి

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 16: సార్వత్రిక ఎన్నికల బరిలో నిలుస్తున్న అభ్యర్థుల రోజువారీ వ్యయాన్ని తప్పనిసరిగా లెక్కించాలని జిల్లా అటవీ అధికారి, ఎన్నికల వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి భరణి ఆదేశించారు. కాకినాడలో ఆమె సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భరణి మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయాలను విధిగా సమర్పించాలన్నారు. అభ్యర్థులు ప్రత్యేక బ్యాంకు ఖాతా, రిజిస్టర్లు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ఖర్చులపై పోటీలో ఉండే అభ్యర్థులకు అవగాహన కల్పించాలన్నారు. అభ్యర్థుల వ్యయాలకు సంబంధించి రోజువారీ నివేదికలను అందజేయాలన్నారు. ఎన్నికల వ్యయపర్యవేక్షణ అదనపు నోడల్‌అధికారి రమణారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులకు అనుగుణంగా కూలీల సంఖ్య: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 16: జాతీయ ఉపాధి హామీ పథకం పనులకు అనుగుణంగా కూలీల సంఖ్య పెంచేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ జె.నివాస్ ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంనుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి వివిధ జిల్లాల కలెక్టర్లతో ఉపాధి హామీ పనులు, పనిదినాలు, తాగునీటి సరఫరా, వేసవిలో విద్యుత్తు సరఫరా వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఉపాధి హామీ పనులకు అనుగుణంగా కూలీల సంఖ్యను పెంచుతున్నామని కలెక్టర్ బదులిచ్చారు. పంచాయతీలతోపాటు ఆవాసాల్లో పనులు జరిగేలా చూడాలని ఆదేశించారు. కూలీలు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ఉదయం 6నుంచి ఉదయం 10 గంటల వరకు మాత్రమే పనిచేసేలా చూడాలన్నారు. తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్‌కిట్ సిద్ధంగా ఉంచాలన్నారు. జిల్లాలో అన్నిప్రాంతాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్వో తిప్పేనాయక్, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, డీపీవో భారతి సౌజన్య, ఏపీఈపీడీసీఎల్ ఈఈ ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగన్ నీ డ్రామాలు కట్టిపెట్టు



పిఠాపురంలో టీడీపీ నేతకు గులకరాయి తగిలినట్టుగా చూపి నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురంలో ఐక్యత.. ఇతర ప్రాంతాల్లో కూటమి అభ్యర్థులకు ఆదర్శం

- టీడీపీ, జనసేన సమన్వయ కమిటీ సమావేశంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, ఏప్రిల్ 16: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులు ఐకమత్యంతో పనిచేస్తున్న విధానం రాష్ట్రంలో కూటమి అభ్యర్థులు పోటీ చేస్తున్న అన్ని నియోజకవర్గాలకు ఆదర్శం కావాలని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు అన్నారు. పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో టీడీపీ, జనసేన పార్టీల సమన్వయ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో నాగబాబు మాట్లాడుతూ జగన్‌రెడ్డి ప్రజలను బానిసలుగా భావిస్తున్నారని, తనను తాను రాజుగా ఊహించుకుంటూ సంక్షేమ పథకాలను దానం చేసినట్లు ఊహాలోకాల్లో విహరిస్తున్నారని విమర్శించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంలో సంపదను సృష్టించి సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పార్టీల పరంగా ప్రత్యర్థులయినా సిద్ధాంతపరంగా పోరాడేవారని గుర్తు చేశారు. అసెంబ్లీలో ఇద్దరి మధ్య చర్చ జరుగుతుంటే చూడముచ్చటగా ఉండేదని తెలిపారు. జగన్‌రెడ్డి మాత్రం అసెంబ్లీని బూతులమయంగా చేసి తన అనుయాయులతో చంద్రబాబు, ఆయన కుటుంబసభ్యులను తిట్టించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ మాట్లాడుతూ టీడీపీ, జనసేన నాయకులు కలిసి మెలిసి ఐక్యంగా పవన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో కూటమి పార్టీల మధ్య పొత్తు ప్రాధాన్యాన్ని వివరించాలని సూచించారు. చంద్రబాబుకు ఇచ్చిన మాట ప్రకారం పవన్‌ను అసెంబ్లీకి పంపుతామని తెలిపారు. సమావేశంలో జనసేన, టీడీపీ నాయకులు వేములపాటి అజయ్‌కుమార్, మర్రెడ్డి శ్రీనివాస్, మహేందరరెడ్డి, శంకరగౌడ్, బన్ని వాసు, శరత్, కొండేపూడి ప్రకాష్, ఉలవకాయల దేవేంద్రుడు, గుండ్ర సుబ్బారావు, అనిశెట్టి సత్యానందరెడ్డి, బర్ల అప్పారావు, మడికి ప్రసాద్, మొల్లి నాగమరిడిరాజు, సూరవరపు సుబ్బారావు, వెన్నా జగదీష్, పిల్లారమ్యజ్యోతి, పిల్లా శివశంకర్, జ్యోతుల శ్రీనివాస్, దానం లాజర్‌బాబు, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, చల్లా లక్ష్మి, జోగా వెంకటరమణ, సూరవరపు సురేష్, మాగ్రీడి రంగబాబు, తోలేటి శిరీష, కురుమళ్ల రాంబాబు, సానా నాగు, వాకపల్లి సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

నేడు సాయంత్రం గొల్లప్రోలు పట్టణంలో నాగబాబు రోడ్‌షో

పిఠాపురం రూరల్, ఏప్రిల్ 16: జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు బుధవారం సాయంత్రం రోడ్‌షో నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3గంటలు నుంచి ప్రారంభమయ్యే ఈ రోడ్‌షోకు సంబంధించిన పోస్టర్లను పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో జరిగిన కార్యక్రమంలో జనసేన పార్టీ నేతలు ఆవిష్కరించారు. పిఠాపురంనుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ గొల్లప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలనుంచి ఈ రోడ్‌షో ప్రారంభమవుతుందని వారు తెలిపారు. ఈ రోడ్ షోకు జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జాతీయ మీడియా కోఆర్డినేటర్ వేములపాటి అజయకుమార్, నియోజకవర్గ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేందరరెడ్డి, వీరమహిళల విభాగం ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ చల్లా లక్ష్మి, నాయకులు కడారి తమ్మయ్యనాయుడు, పిల్లా శివశంకర్, కురుమళ్ల రాంబాబు, సూరవరపు సురేష్, శశియాదవ్, తోలేటి శిరీష పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలుకు 13 రకాల డాక్యుమెంట్లు తీసుకురావాలి

- డాక్యుమెంట్లు సక్రమంగా ఉంటేనే అనుమతిస్తాం
- ఒక అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్లు దాఖలు చేయవచ్చు
- నామినేషన్ సమయంలో అభ్యర్థితో కలిపి ఐదుగురికే అనుమతి
- నామినేషన్ దాఖలునుంచి అభ్యర్థి ఎన్నికల ఖర్చు లెక్కిస్తాం
- జిల్లా కలెక్టర్ జె.నివాస్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 16: సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు నామినేషన్ల దాఖలకు 13 రకాల డాక్యుమెంట్లు తీసుకురావాలని కలెక్టర్ జె.నివాస్ సూచించారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన వెలువరించారు. అన్ని డాక్యుమెంట్లు సక్రమంగా ఉంటేనే నామినేషన్లను అనుమతిస్తామన్నారు. పార్లమెంట్ నియోజకవర్గంకోసం ఫారం 2ఏ, అసెంబ్లీ నియోజకవర్గం కోసం ఫారం 2బీ సమర్పించాలన్నారు. ఒక అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చునన్నారు. రెండు కంటే ఎక్కువ నియోజకవర్గాలనుంచి అభ్యర్థులు నామినేషన్లు వేసే అవకాశం లేదన్నారు. అభ్యర్థులు దరఖాస్తులో అన్ని కాలమ్స్ పూరించాలన్నారు. అఫిడవిట్ ప్రతి పేజీపైనా అభ్యర్థి విధిగా సంతకం చేయాలన్నారు. పార్లమెంట్ నియోజకవర్గానికి జనరల్ అభ్యర్థి రూ.25వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే కుల ధ్రువీకరణ పత్రంతోపాటు రూ.12,500 సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గానికి జనరల్ అభ్యర్థి రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5వేలు చెల్లించాలన్నారు. అభ్యర్థులు మూడు కలర్ ఫొటోలను సమర్పించాలన్నారు. ఇతర నియోజకవర్గాల అభ్యర్థులు ఎలక్టోరల్ రోల్ సర్టిఫైడ్ కాపీని విధిగా అందజేయాలన్నారు. అభ్యర్థుల వ్యయపరిశీలనకోసం నూతన బ్యాంకు ఖాతాలను తెరిచి వివరాలు అందజేయాలన్నారు. బ్యాలెట్ పేపర్‌లో తమ పేరు తెలుగు, ఇంగ్లీషుల్లో ఏ భాషలో ప్రచురించాలో తెలియజేయాలన్నారు. ఇండిపెండెంట్ అయితే ఎంచుకున్న సింబల్‌ను తెలియజేయాలన్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో వంద మీటర్ల వృత్తి పరిధిలో గరిష్ఠంగా మూడు వాహనాలను అనుమతిస్తామన్నారు. నామినేషన్ దాఖలు సమయంలో అభ్యర్థితో కలిపి ఐదుగురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసిన దగ్గర నుంచి ఎన్నికల ఖర్చు అతడి ఖాతాలో లెక్కిస్తామన్నారు. పత్రికల్లో వచ్చే ప్రకటనలు, పెయిడ్ న్యూస్ వార్తలను అభ్యర్థి ఖాతాలో లెక్కిస్తామని చెప్పారు.

రేపు మంచినీటి సరఫరాకు అంతరాయం

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 16: కాకినాడ నగరపాలక సంస్థలోని శశికాంత్‌నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్ నుంచి మంచినీటి సరఫరా చేసే మెయిన్ వాటర్ పంపింగ్ లైన్ మీద లీక్ ఏర్పడడంతో దాని మరమ్మతు నిమిత్తం 18వతేదీ సాయంత్రం మంచినీటి సరఫరా నిలుపుదల చేసి 19వతేదీ ఉదయం యథావిధిగా సరఫరా చేస్తారు. శశికాంత్‌నగర్, శ్రీవిద్యకాలనీ(డీమార్ట్), భాస్కర్‌నగర్, దుమ్ములపేట, సాంబమూర్తినగర్, ఏఎంజీ, శ్రీనివాస బ్యాంకుకాలనీ(గైగోలపాడు) 1 నుంచి 13, 49, 50 వార్డులు ఏరియాల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగరపాలక సంస్థ తెలిపింది. మంచినీరు అత్యవసరమైతే ట్యాంకులకోసం 9676770461, 9848471415, 6301387834 నెంబర్లను సంప్రదించాలన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌కు ఈవీఎం, వీవీప్యాట్‌ల తరలింపు

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 16: కాకినాడ సిటీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎం, వీవీ ప్యాట్‌లను మంగళవారం మెక్లారిన్ స్కూల్ ఆవరణలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఉన్న తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు. రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు పర్యవేక్షణలో వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో భద్రపరిచి సీల్ వేశారు. సిటీ నియోజకవర్గానికి సంబంధించి 281 కంట్రోల్ యూనిట్లు, 281 బ్యాలెట్ యూనిట్లు, 305 వీవీప్యాట్‌లు ఇక్కడకు కేటాయించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఏఆర్వో చల్లన్నదొర, డిప్యూటీ తహసీల్దార్లు నాయుడు, సీహెచ్ అనిల్‌కుమార్, పవన్, ఆర్ఐ దీపక్ ఉన్నారు. త్వరలోనే కేంద్ర పరిశీలకులు ఇక్కడకు రానున్నారని రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు తెలిపారు. పీఆర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో ఓపీవోలకు రెండురోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. రెండురోజుల్లో 2400మందికి శిక్షణ ఇచ్చారు. ఆర్వో వెంకటరావు పర్యవేక్షించి ఎన్నికల విధులపై సూచనలు ఇచ్చారు.

ప్రజల దాహం తీర్చడంలో యంత్రాంగం నిర్లక్ష్యం

- చలివేంద్రాల ఏర్పాట్లలో మీనమేషాలు

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 16: జిల్లాలో ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయిలో నమోదవుతున్నాయి. వేసవి ఆరంభంలోనే సూర్యుడు నిప్పులు కక్కుతున్నాడు. ఉదయం 8గంటలనుంచే సెగలు పుట్టిస్తున్నాడు. గొంతు తడుపుకుందామని చూస్తే చలివేంద్రాలు ఎక్కడా కనిపించడంలేదు. వేసవి ప్రారంభమైనా చలివేంద్రాల ఏర్పాటులో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో ప్రజలకు గొంతు తడుపుకొనేందుకు గుక్కెడు నీళ్లు కూడా దొరకడం లేదు. వేసవిలో ప్రజల దాహం తీర్చడంలో నగరపాలకసంస్థ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ప్రతిఏటా మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ఎంతో మంది దాతలు ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. అధికారులు స్పందించి నగరంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రేపటి నుంచి వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలు - 5లో
19న యానాంలో ఎంపీ పోలింగ్ - 5లో
చేబ్రోలులో రాతిరేల రాములోరి పెళ్లి - 5లో
రత్నగిరిపై నవమి వేడుకలు ప్రారంభం - 5లో

కాగితపు పూల సోయగం

సత్యవాడ ప్రత్యేకం







కాగితపు పూలను తయారు చేస్తున్న గ్రామస్థులు

సత్యవాడ(కె.గంగవరం), మార్చి15: ఆధ్యాత్మిక వాడగా పేరుగాంచిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం సత్యవాడలో శ్రీరామనవమికి ఓ ప్రత్యేకత ఉంది. భద్రాచలంలో సీతారాముల కల్యాణం ఏవిధంగా జరుగుతుందో ఇక్కడా అదే విధంగా జరుపుతారు. ఆరుబయట చలువ పందిళ్లు వేసి అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. ముఖ్యంగా ఇక్కడ పందిళ్ల అలంకరణ ప్రత్యేక ఆకర్షణ. సీతారాములు కల్యాణం చేయడానికి వేసే చలువ పందిళ్లను ఆకట్టుకునే విధంగా అలంకరిస్తారు. ఒక్కో చలువ పందిరి డెకరేషన్‌కు రూ.3 లక్షలు నుంచి 4 లక్షలు ఖర్చు చేస్తారు. అలంకరణ కోసం గ్రామంలోని ప్రతీవారు రేయంబవళ్లు కష్టపడతారు. మహాశివరాత్రి పర్వదినం నుంచి పందిళ్లలో అలంకరించే పూల కుండీల తయారీలో నిమగ్నమవుతారు. ఉగాది పర్వదినం నుంచి పందిళ్ల నిర్మాణం చేపడతారు. పందిళ్లలో పూల కుండీలు ప్రత్యేక ఆకర్షణ. ప్రత్యేకంగా విజయవాడ నుంచి తీసుకుని వచ్చిన క్రేప్, గున్నపేపరు, వార్నిష్ పేపరుతో గులాబీ, చామంతి, మందారం, మల్లె, పొద్దుతిరుగుడు, నైట్‌క్వీన్ వంటి పూలను కాగితాలతో తయరు చేస్తారు. ఇలా తయారు చేసిన 50 నుంచి 80 పూలతో ఒక కుండీని తయారు చేస్తారు. ఒక్కో పందిరిలో 24 కుండీలు, అంతకంటే ఎక్కువ అలంకరిస్తారు. ఈ పూల కుండీలు సహజమైన పూల మాదిరిగా ఉండి విశేషంగా ఆకట్టుకుంటాయి. చిన్న పెద్ద తారతమ్యంలేకుండా ప్రతీవారు పందిరి అలంకరణలో పాల్గొంటారు.

సీతారాములకు తీపి కానుక









పి.గన్నవరం, ఏప్రిల్ 16: శ్రీరామనవమి రోజున శ్రీసీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా చేసేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం వైనతేయ గోదావరి నది తీరాన వేంచేసి ఉన్న శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే పాలకోవతో పాటు వివిధ రకాల పిండి వంటలు 100కు పైగా రకాలతో తయారు చేసిన స్వీట్లను పి.గన్నవరం గ్రామానికి చెందిన పేరిచెర్ల భీమరాజు, శ్రీమతి సత్యవాణి దంపతులు కల్యాణం రోజున సీతారాములకు సమర్పించేందుకు సిద్ధం చేస్తున్నారు. 15 సంవత్సరాలుగా స్వామి వారి కళ్యాణానికి కంతసారెను తయారు చేస్తున్నామని ఈ సారెను కల్యాణం రోజున వరుడు (రాముడు) తరపున వధువు (సీతమ్మతల్లి)కి సమర్పిస్తామని భీమరాజు, సత్యవాణి దంపతులు తెలిపారు. గత 20 రోజులుగా మహిళల సహకారంతో సుమారు 200 లీటర్ల పాలతో తయారు చేసిన కోవను ఉపయోగించి పంచె, చీరతో పాటు స్వామి వారి నామం, శంఖు చక్రాలు, పర్ణశాల, వివిధ రకాల పండ్లు, కాయలు, కూరగాయలు తదితర ఆకారాలలో సీట్లు తయారు చేశామని ఆమె తెలిపారు. ఇవే కాకుండా వివిధ రకాల పిండి వంటలు కూడా అధిక మొత్తంలో సిద్ధం చేసినట్లు ఆమె చెప్పారు. కల్యాణం రోజున ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై కంతసారెను ఉంచుతామని తెలిపారు. సీతారాముల కల్యాణం అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు అమ్మవారి కంత సారె ప్రసాదాన్ని అందిస్తామని ఆమె చెప్పారు. అదే విధంగా ఆలయం ఎదుట స్వామి వారి కల్యాణానికి పర్ణశాల, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిమిత్తం చలువ పందిళ్ల ఏర్పాటు చేశారు. రంగులతో ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు.

సుందరం శ్రీరామగిరి

చలువ పందిళ్ల ఏర్పాటు చేసిన దృశ్యం

వరరామచంద్రాపురం, ఏప్రిల్ 16: వరరామచంద్రపురం మండలంలో ప్రసిద్ధి శ్రీరామగిరి గ్రామంలో శ్రీసుందర సీతారామచంద్రస్వామి వారి తిరు కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్వామివారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. శబరి, గోదావరి సంగమ తీరాన ఈ దేవాలయం రెండో భద్రగిరిగా పేరుపొందింది. స్వామి వారి తిరు కల్యాణం ప్రతిఏటా శ్రీరామనవమి పర్వదినాన అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. స్వామివారి కల్యాణానికి ఆలయ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మండపం చుట్టూ చలువ పందిళ్లు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. రాములోరి ఆలయాన్ని పంచవర్ణాలతో, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

రేతిరేల రాములోరి పెళ్లి




చేబ్రోలులో సీతారామ ఆలయం

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 16: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలు గ్రామంలో సీతారామస్వామి దేవస్థానంలో మిగిలిన ప్రాంతాలకు భిన్నంగా స్వామివారి కల్యాణం జరుగుతుంది. సాధారణంగా ప్రతిచోట పగటిపూట కల్యాణం నిర్వహిస్తే ఇక్కడ రాత్రి వేళ సీతారామస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తారు. ఇక్కడ రాత్రి పూట స్వామివారి కల్యాణం జరపడం ఆనవాయితీగా వస్తోంది. పూర్వం పిఠాపురం మహారాజా ఇక్కడ కల్యాణంలో పాల్గొనేందుకు వీలుగా ఈ ఏర్పాటు చేసినట్లు చెబుతారు. అప్పటి నుంచి ఇదే పద్ధతిని పాటిస్తున్నారు. కల్యాణాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాలు నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. ఆలయ కమిటీ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది.

రత్నగిరిపై నవమి వేడుకలు ప్రారంభం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, ఏప్రిల్ 16: సత్యదేవుడి ఆలయ క్షేత్రపాలకులుగా పూజలందుకుంటున్న సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 24 వరకు జరిగే ఈ వేడుకలలో భాగంగా సీతారాములు తొలిరోజున పెండ్లి కుమారుడు, పెండ్లికుమార్తెలుగా అనుగ్రహించారు. సాయంత్రం 4 గంటలకు రామాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై నవ దంపతులు కానున్న సీతారాములను పెండ్లిపెద్దలైన సత్యదేవుడు, అనంత లక్ష్మీ అమ్మవార్లను మరోవేదికపై ఆశీనులు గావించారు. ఈ సందర్భంగా పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం ఉల్లాకల గౌరీపూజను నిర్వహించిన అనంతరం చతుర్వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ముత్తైదువులు పసుపు దంచి సీతారాములకు నుదుట తిలకం, బుగ్గను చుక్క పెట్టి దివ్యాభరణాలను అలంకరింపచేశారు. వైదిక కార్యక్రమాలను ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, వైదిక బృందం చామర్తి కన్నబాబు, గొల్లపల్లి వెంకట సుబ్రహ్మణ్య ఘనాపాటి, దేవుల పల్లి ప్రసాద్ తదితరులు నిర్వహించగా పీఆర్వో కృష్ణారావు, ఏపీఆర్వో గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాములోరి కల్యాణం

సీతారాముల దివ్య కల్యాణోత్సవాలలో భాగంగా రెండో రోజైన బుధవారం ఉదయం సీతారాముల దివ్య కల్యాణం వార్షిక కల్యాణ వేదికపై అంగరంగ వైభవంగా జరగనుంది. ఉదయం 6 గంటలకు ధ్వజారోహణం, అంకురార్పణ చేస్తారు అనంతరం నవదంపతులు కానున్న సీతారాములను వెండి ఆంజనేయ వాహనంపై సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను వెండిపల్లకిలో గ్రామోత్సవం నిర్వహించి కల్యాణ వేదిక వద్దకు తీసుకుని వచ్చి కల్యాణ తంతుకు శ్రీకారం చుడతారు.




పసుపు దంచుతున్న ముత్తైదువులు

రేపటి నుంచి వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలు




ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న అధికారులు

ఆత్రేయపురం, ఏప్రిల్ 16: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాలను ఈ నెల 18 నుంచి 24 వరకు వైభవంగా నిర్వహించనున్నారు. లక్షలాది మంది భక్తులు తరలి రానున్న దృష్ట్యా వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. 18వ తేదీ గురువారం అంకురార్పణ, ధ్వజారోహణతో కల్యాణోత్సవాలు ప్రారంభమవుతాయి. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు చైత్రశుద్ధ ఏకాదశి రోజున స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. అదే రోజు తీర్థం, రథోత్సవం జరుగుతాయి. 20న పొన్న వాహనంపై స్వామివారి గ్రామోత్సవం, 21న మహదాశీర్వచనం, సదస్యం. 22న గౌతమి నదిలో తెప్పోత్సవం, 23న మహా పూర్ణాహుతి, చక్రస్నానం, ధ్వజావరోహణ, 24 శ్రీపుష్పోత్సవంతో కల్యాణోత్సవాలు ముగుస్తాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన వాయిద్య కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ముఖ్య కూడళ్ల వద్ద హోర్డింగులు, అలంకరణలు చేస్తున్నారు. ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ ఉత్సవ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కొత్తపేట ఆర్డీవో సత్యనారాయణ రెండుసార్లు వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ట్రస్టు బోర్డు పదవీకాలం పూర్తికావడంతో ప్రత్యేకాధికారి పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనరు ఎం.విజయరాజును ప్రత్యేకాధికారిగా నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షించారు. ఆలయ పరిసరాలు, కల్యాణ వేదిక ప్రాంగణం, పుష్కరఘాట్ల వద్ద చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.



విద్యుత్ తీగ తగిలి గేదెల కాపరి మృతి

గుట్టుచప్పుడు కాకుండా పూడ్చిపెట్టిన పొలం యజమాని

నిలదీయడంతో విషయం బయటకు..మృతదేహానికి పోస్టుమార్టం



రౌతులపూడి, ఏప్రిల్ 16: విద్యుత్‌షాక్‌కు గురై కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం గిడజాం గ్రామానికి చెందిన యర్రా సత్తిబాబు(42) మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. యర్రా సత్తిబాబు సోమవారం గేదెలను తోలుకుని వెళ్లాడు. ఇదే గ్రామానికి చెందిన పూడి తాతీజీకి చెందిన పొలంలో కోతులు బారి నుంచి పంటను రక్షించుకునేందుకు కంచెకు విద్యుత్ అమర్చాడు. విషయం తెలియని సత్తిబాబు తాతాజీ పొలంలోకి గేదెలు పోతుంటే మళ్లించడానికి వేగంగా వెళ్లాడు. విద్యుత్ అమర్చి ఉన్న కంచెకు తగులుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. విషయం బయటకు పొక్కకుండా తాతాజీ పక్కనే ఉన్న గెడ్డలో సత్తిబాబు మృతదేహాన్ని పూడ్చిపెట్టాడు. గేదెలు తోలుకుని వెళ్లిన తండ్రి రాకపోవడంతో కుమారులు పొలంలో వెతకగా తండ్రి కన్పించలేదు. తాతాజీపై అనుమానంతో గట్టిగా నిలదీయగా జరిగిన విషయం చెప్పి మంగళవారం ఉదయం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. సీఐ శేఖర్‌బాబు, ఎస్ఐ వెంకటేశ్వరరావు, తహశీల్దార్ విద్యపతి సమక్షంలో పూడ్చిపెట్టిన మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



సత్తిబాబు

19న యానాంలో ఎంపీ పోలింగ్

నేటి సాయంత్రంతో ముగియనున్న ప్రచారం



సమీక్ష నిర్వహిస్తున్న ఆర్ఎ మునిస్వామి

యానాం, ఏప్రిల్ 16: కేంద్రపాలిత ప్రాంతమైనా యానాం నియోజవర్గంలో ఈనెల 19వ తేదీ శుక్రవారం పుదుచ్చేరి పార్లమెంట్ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. పుదుచ్చేరి రాష్ట్రానికి ఉన్న ఏకైక పార్లమెంట్ స్థానంలో మొత్తం 30 నియోజకవర్గాలు ఉన్నాయి. వాటిలో ఒకటి యానాం. మొత్తం 10,23,699 మంది ఓటర్లు ఉన్నారు. యానాంలో 39,408 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 19,037, మహిళలు 20,371 మంది ఉన్నారు. యానాం నియోజవర్గ పరిధిలో మొత్తం 10 వార్డులకు గాను 33 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని ఏర్పాట్లను యానాంలోని ఎన్నికల విభాగం పూర్తి చేసింది. పుదుచ్చేరి లోక్‌సభ స్థానం నుంచి మొత్తం 26 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. గత కొన్ని రోజులుగా యానాంలో ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. 17వ తేదీన సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగియనుంది. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఎన్డీయే అలియెన్స్‌లో ఉండటంతో బీజేపీకి మద్దతు తెలపగా స్థానిక స్వతంత్ర ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కూడా బీజేపీకి మద్దతు తెలపడంతో ఇరువురు బీజేపీకి ప్రచారం నిర్వహించడం విశేషం.

రూ.6 లక్షల పట్టివేత

పెద్దాపురం, ఏప్రిల్ 16: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన తనిఖీల్లో రూ.6లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పెద్దాపురం ఆర్డీవో జె.సీతారామారావు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కె. వెంటరాజగుప్త ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో కాండ్రకోట గ్రామానికి చెందిన పల్లికల రామచంద్రమూర్తి నుంచి రూ. 6లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన నగదుకు సరైన ధ్రువపత్రాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసి ట్రెజరీకి జమ చేశామన్నారు.

రూ.2.97 లక్షలు స్వాధీనం

కిర్లంపూడి, ఏప్రిల్ 16: యానాం నుంచి ప్రత్తిపాడు వెళ్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి రూ.2.97లక్షలు కిర్లంపూడిలో మంగళవారం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. యానాంకు చెందిన సమయంతుల వెంకటసూర్య మల్లేశ్వరరావు కారులో డబ్బుతో కిర్లంపూడి మీదుగా ప్రత్తిపాడు వెళ్తున్నాడు. ఆయన వద్ద ఎటువంటి ఆధార పత్రాలు లేకపోవడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ ఆ సొమ్మును స్వాధీన పరుచుకుని జగ్గంపేట ఆర్వో కార్యాలయానికి తరలించింది. సంబంధిత ఆధార పత్రాలు చూపిస్తే సొమ్ము తిరిగి ఇస్తామని ఆర్వో శ్రీనివాస్ తెలిపారు.

కోడి పందాలపై పోలీసుల దాడి

రావులపాలెం, ఏప్రిల్ 16: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం పొడగట్లపల్లిలోని ఓ తోటలో మంగళవారం రహస్యంగా కోడి పందేలు నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న సీఐ ఆంజనేయులు సిబ్బందితో అక్కడికి చేరుకుని దాడి చేశారు. 40 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,28,400 నగదు, 15 మోటారు సైకిళ్లు, మూడు కార్లు, 13 కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు సీఐ చెప్పారు.

జగన్ టూర్ షెడ్యూల్లో మార్పు

రావులపాలెం, ఏప్రిల్ 16: సీఎం జగన్ టూర్ షెడ్యూల్లో మార్పు జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడు శివారు మల్లయ్యదొడ్డి సెంటరు సమీపంలోని ఒక ప్రైవేటు లే-అవుట్‌లో సీఎం మంగళవారం రాత్రి బస చేయాల్సి ఉండగా ఆ కార్యక్రమం రద్దయ్యింది. ఈ నెల 18న ఆయన బస్సు యాత్ర రావులపాలెం మీదుగా మడికి వస్తుంది.

సచివాలయ కార్యదర్శి సస్పెన్షన్

కడియం, ఏప్రిల్ 16: మండలంలోని కడియపులంక సచివాలయం-2 గ్రేడ్ 5 కార్యదర్శి ఎండీ ఫర్విన్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఉత్తర్వులు జారీ చేశారు. ఫర్విన్ గ్రామంలో 219 పోలింగ్ బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్‌ఓ)గా ఉన్నారు. అయితే గ్రేడ్ 5 కార్యదర్శి బీఎల్‌వో డ్యూటీ చేయడం ఏమిటని మండలస్థాయి అధికారులకు ఎదురుచెప్పడంతో జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నియోజకవర్గ ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ స్వయంగా ఇచ్చిన ఆదేశాలు కూడా ఆమె లెక్కచేయలేదు. దీంతో కలెక్టర్‌కు రిపోర్ట్ చేయడంతో ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నందుకుగాను ఫర్విన్‌ను సస్పెండ్ చేస్తూ మాధవీలత ఉత్తర్వులు జారీ చేశారు.

రిటర్నింగ్ అధికారులు సన్నద్ధంగా ఉండాలి

రంపచోడవరం, ఏప్రిల్ 16: ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నిర్వహణకు రిటర్నింగ్ అధికారులు సర్వసన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. విజయవాడ నుంచి మంగళవారం సాయంత్రం అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం నుంచి కలెక్టర్ ఎం.విజయసునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న నామినేషన్ల స్వీకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలు ఇతర అంశాలపై సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్సులో ఆర్వోలు, జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి పాల్గొన్నారు.

ఘనంగా ఏపీటీఎఫ్ 80వ ఆవిర్భావ వేడుకలు

మండపేట, ఏప్రిల్ 16: తాపేశ్వరం కేంద్రంగా 80 ఏళ్ల క్రితం అంటే 1944 ఏప్రిల్ 16న ఆవిర్భవించిన ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆవిర్భావ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజరాజేశ్వరి కల్యాణ మండపంలో సంఘం రాష్ట్రాధ్యక్షుడు జి.హృదయరాజు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఉపాధ్యాయుల సమస్యలపై తమ సంఘం చేస్తున్న పోరాటం, సాధించిన విజయాలను వక్తలు వివరించారు. ముఖ్య అతిథిగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పుత్రసత్యశర్మ మనుమడు పుత్రసత్యశర్మ హాజరై మాట్లాడుతూ తన తాతయ్య ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడేందుకు ఏర్పాటు చేసిన సంఘం నేటికి నిర్విరామంగా కొనసాగుతుండటం హర్షణీయమన్నారు. ఉపాధ్యాయ ప్రగతి పత్రిక, ప్రధాన సంపాదకులు జి.సత్యనారాయణ, ఐపీయూ నాయకులు కె.సుబ్బారెడ్డి, గౌరవ అధ్యక్షుడు ఎ.సదాశివ, సీనియర్ కామ్రేడ్ రామారావు, లక్ష్మణరావు, కేవీవీ సత్యనారాయణ, ఉదయబ్రహ్మం, కనుపూరి సుబ్బారావు, కనుపూరి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సరికొత్త బోధనా పద్ధతులపై శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 16: నూతన విద్యా విధానాన్ని అనుసరించి సరికొత్త బోధనా పద్ధతులపై అర్థశాస్త్ర అధ్యాపకులకు శిక్షణా కార్యక్రమం మంగళవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ప్రారంభమైంది. కళాశాల విద్య కమిషనరేట్ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 22వ తేదీ వరకూ ఈ శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. రాజమహేంద్రవరం, కాకినాడ, తణుకు, తాడేపల్లిగూడెం, విజయవాడ నోడల్ రిసోర్సు కేంద్రాల పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అర్థశాస్త్ర అధ్యాపకులు పాల్గొన్నారు. కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్ వర్చువల్ విధానంలో ఈ తరగతులను ప్రారంభిస్తూ నూతన విద్యా విధానం-2020లో సింగిల్ మేజర్ సబ్జెక్టుల కోసం కళాశాల విద్య తీసుకుంటున్న విధానాలను వివరించారు. అధ్యాపకులకు దిశా నిర్దేశం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు, నోడల్ రిసోర్స్ కేంద్రం రాజమహేంద్రవరం సమన్వయకర్త సీహెచ్ సంజీవ్‌కుమార్, నాలెడ్జ్ రిసోర్సు పర్సన్లు డీవీ నాగేశ్వరరావు, కె.యమున, కె.స్వరూప, జి.పావని దేవి తదితరులు పాల్గొన్నారు.



మల్లేపల్లిలో నవ దుర్గ వేషాల్లో చిన్నారులు

నవదుర్గ వేషాలతో ప్రదర్శన

గండేపల్లి, ఏప్రిల్ 16: మండలంలోని మల్లేపల్లి నీలికుండీపేటలో కోలాట బృంద సభ్యు లు నవదుర్గ వేషాలతో ప్రదర్శన చేశారు. చుట్టుపక్కల ప్రజలు ప్రదర్శనను తిలకించారు.

'శిరోముండనం కేసులో తీర్పు హర్షణీయం'

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 16: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం రేపిన వెంకటాయపాలెం శిరోముండనం కేసులో తీర్పు హర్షణీయమని పీవీ రావు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ అన్నారు. ఈ కేసులో ముద్దాయిగా పరిగణించిన తోట త్రిమూర్తులును వైసీపీ సస్పెండ్ చేసి మండపేట ఎమ్మెల్యే టిక్కెట్ వెనక్కి తీసుకుని దళితులకు సీఎం జగన్ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్‌ను పార్టీ సస్పెండ్ చేయాలని లేదంటే దళితుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ది గ్రేట్ సిన్సియర్ జర్నలిస్ట్ టీఎస్ఎన్ రాజు వల్లే శిరోముండనం కేసు వెలుగు చూసిందని పౌరసంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అన్నారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ కేసును అత్యంత సాహసంగా టీఎస్ఎన్ రాజు కలం ద్వారా పటిష్టమైన ఆధారాలతో వాస్తవాలను వెలుగులోకి తెచ్చి లోకం ముందుంచిన కారణంగానే ఆలస్యమైనా న్యాయస్థానం తీర్పు వెల్లడించిందన్నారు.

తాళ్లరేవు: శిరోముండనం కేసులో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకు జైలుశిక్ష, జరిమానా విధించి తీర్పు చెప్పడంపై దళితులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు వెంటపల్లి చంద్రమౌళి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి దళితనేతలు నివాళులర్పించారు. రాజ్యాంగం గెలిచిందని నినాదాలు చేశారు. కార్యక్రమంలో దళిత నేతలు కాశి లక్ష్మణస్వామి, జక్కల ప్రసాద్‌బాబు, గోడి బాస్కరరావు, దున్నా సుబ్రహ్మణ్యం, పెయ్యల శ్రీనివాస్, దడాల జగదీశ్వరరావు, దున్నా మురళి, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: దళితుతడిని హతమార్చి డోర్ డెలీవరీ చేసిన ఎమ్మెల్సీ అనంత బాబును, దళితులను శిరోముండనం చేసిన మరొక వైసీపీ ఎమ్మెల్సీని వైసీపీ నుంచి సస్పెండ్ చేయాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టా జానకిరామారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు శిక్ష విధిస్తూ తీర్పు విడుదల కావడంపట్ల హర్షం వ్యక్తం చేసి తీవ్ర ఆలస్యమైనా న్యాయం గెలిచిందన్నారు.

'వలంటీర్లతో బలవంతపు రాజీనామాలు సిగ్గుచేటు'

తాళ్లరేవు, ఏప్రిల్ 16: గ్రామ వలంటీర్లతో వైసీపీ నేతలు బలవంతంగా రాజీనామాలు చేయించడం సిగ్గుచేటని అమలాపురం పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి టేకుమూడి లక్ష్మణరావు ఆరోపించారు. మంగళవారం తాళ్లరేవు పార్టీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ వలంటీర్లతో వెట్టిచేకరి చేయించుకుని ఎన్నికల్లో వైసీపీ ప్రయోజనాల కోసం బలవంతంగా రాజీనామాలు చేయడం తగదన్నారు. అమలాపురం పార్లమెంటు కార్యాలయ కార్యదర్శి మందాల గంగసూర్యనారాయణ మాట్లాడుతూ ప్రలోభాలకు లోనై బలవంతంగా రాజీనామాలు చేసి మీ భవిష్యత్‌లను పాడు చేసుకోవద్దన్నారు. రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ, రేళ్ల శ్రీనివాసచక్రవర్తి, నిమ్మకాలయ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామాలు

సామర్లకోట, ఏప్రిల్ 16: సామర్లకోట పట్టణ పరిధిలో 29వ వార్డుకు చెందిన నలుగురు వలంటీర్లు దూలపల్లి రాజు, సూరిశెట్టి ప్రియాంక, జీఎస్వీ రోహిణీ, మలిపిరెడ్డి వెంకటలక్ష్మి తమ విధులకు మంగళవారం రాజీనామాలు చేస్తున్నట్టు లిఖిత పూర్వకంగా సచివాలయ అడ్మిన్ అధికారికి రాజీనామా పత్రాలను అందజేశారు.

తాళ్లరేవు: తాళ్లరేవు మండలంలోని 42మంది వలంటీర్లు రాజీనామా చేసినట్టు ఎంపీడీవో ప్రభాకరరావు తెలిపారు. పోలేకుర్రులో 20 మంది, చొల్లంగిపేటలో 18మంది, పిల్లంకలో నలుగురు వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు.

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలో నాగులాపల్లి, ఉప్పాడ గ్రామాలకు చెందిన 52 మంది గ్రామ వలంటీర్లు మంగళవారం రాజీనామాలు సమర్పించారని ఎంపీడీవో పి.వెంకటనారాయణ తెలిపారు. సచివాలయాల్లో రాజీనామాలను అందజేశారన్నారు.

'పోలవరం రైతులకు టీడీపీతోనే న్యాయం'

జగ్గంపేట, ఏప్రిల్ 16: పోలవరం రైతులకు టీడీపీతోనే న్యాయం జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 11 గ్రామాలకు చెందిన పోలవరం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు భూములిస్తామని ముందురకొచ్చిన రైతులతో నెహ్రూ మంగళవారం సమావేశం నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు పనులు ప్రారంభించినప్పటి నుంచి మాకు న్యాయం చేస్తామని ఇప్పటికీ చేయలేదన్నారు. నెహ్రూ మాట్లాడుతూ రేపు రాబోయేది టీడీపీ కూటమి ప్రభుత్వమేనని, సమస్యలను పరిష్కరించిమీకు సరైన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఎస్వీఎస్ అప్పలరాజు, కందుల చిట్టిబాబు, పోలవరం రైతులు, బత్తుల వెంకటరమణ, జాజుల శ్రీను, జాజుల ఫణేంద్ర, బలస ప్రకాష్, బలస సునీల్, బలస నాగేశ్వరరావు, తుల్లి రామకోటిఆనందరావు, పసుమర్తి బుజ్జి, తూతిక సతీష్, తూల్లి కృష్ణ, పిట్ల లక్ష్మి, పిట్ల నూకాలమ్మ, దిండి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వంతో పూర్వవైభవం'

కాకినాడ సిటీ, ఏప్రిల్ 16: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం వచ్చిన రోజునుంచి భవన నిర్మాణ రంగానికి పూర్వవైభవం సంతరించుకోనుందని కాకినాడ పార్లమెంట్ జనసేన అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. కాకినాడలోని ఓ హోటల్‌లో కనస్ట్రక్షన్స్ అండ్ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, కాకినాడ రూరల్ అసెంబ్లీ జనసేన అభ్యర్థి పంతం నానాజీ, కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి హాజరయ్యారు. ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ రంగానికి, దానిపై ఆధారపడిన 20రకాల వృత్తుల వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించనుందన్నారు. సమావేశంలో కనస్ట్రక్షన్స్, బిల్డర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

'ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి'

తుని రూరల్, ఏప్రిల్ 16: రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోనే అభివృద్ధి సాధ్యమని కాకినాడ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు స్పష్టం చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ పాండురంగారావు అధ్యక్షతన తుని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పళ్లంరాజు మాట్లాడుతూ అమలు కాని హామీలతో రాష్ట్ర ప్రజలను నిలువునా ముంచిన పాలకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్‌కే పట్టం కట్టాలని కోరారు. పార్టీ కార్యకర్తలతో కలిసి తుని ఎమ్మెల్యే అభ్యర్థి గేలం శ్రీనివాసరావు, పళ్లంరాజులు తునిలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ఇంటి వీరభద్రరావు, బాదం రాంబాబు ఉన్నారు.

వైసీపీకి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజీనామా

తొండంగి, ఏప్రిల్ 16: వైసీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యా శ్రీను బాబు ఆ పార్టీకి రాజీనామా చేశారు. మంగళవారం ఏవీనగరంలో విలేకర్ల సమావేశంలో ఈ మేరకు ప్రకటించారు. బీసీ వర్గాల పట్ల చూపుతున్న వ్యతిరేక ధోరణి,ప్రభుత్వపరంగా చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా చేర్పడంలో వైఫల్యం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు పార్టీ అధ్యక్షుడు జగన్‌కు పంపిన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. త్వరలో ఆయన టీడీపీలో చేరనున్నట్టు తెలుస్తోంది.

జగ్గంపేటలో రూ.2.97 లక్షలు స్వాధీనం

జగ్గంపేట, ఏప్రిల్ 16: లెక్కాపత్రం లేని రూ.2.97 లక్షలను జగ్గంపేట పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పీవై04ఏ 7916 మారుతి సుజుకి ఆర్ వాహనంలో సమయమంతుల సూర్యమల్లేశ్వరరావు ఈ నగదును తీసుకెళ్తుండగా జగ్గంపేట హైవేపై చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేయగా ఎలాంటి పత్రాలను చూపించలేదు. దీంతో సొమ్మును స్వాధీనం చేసుకుని జిల్లా పరిశీలన కమిటీకి పంపారు.

ఎండ దెబ్బకు ఉపాధి కూలీ మృతి




సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 16: కాకినాడ రూరల్ మం డలం సర్పవరానికి చెందిన ఉపాధి మహిళా కూలీ ఎండ దెబ్బకు మృతిచెందింది. స్థానికంగా ఓ చెరువు వద్ద బొండాడ సీత (59) మంగళవారం ఉదయం ఉపాధి హామీ పనిలోకి వెళ్లింది. అక్కడ మస్తరు వేసి ఫొటో తీసే సమయంలో ఒక్క సారిగా అస్వస్థతకు గురై కుప్పకూలిపోయింది. స్థానికులు మెరుగైన చికిత్సకు ఆటోలో ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తోండగా అప్పటికే మృతిచెందింది. మృతి సంఘటన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ గణేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పిఠాపురం రూరల్, ఏప్రిల్ 16: పిఠాపురం మండలం ఎఫ్‌కేపాలెం గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. విరవాడ గ్రామానికి పెంటకోట స్వామి, కొప్పిరెడ్డి శ్రీరామ్‌లు తాపీ పనిచేసేందుకు బైక్‌పై బయలుదేరారు. ఎఫ్‌కేపాలెం జంక్షన్ వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న జేసీబీని పక్కకు తిప్పడంతో వారి బైక్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వారిని చికిత్స నిమిత్తం కాకినాడ ఆసుపత్రికి తరలించగా, కొప్పిశెట్టి శ్రీరామ్ మరణించాడు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పగటి పూట వీధిలైట్ల వెలుగులు

కరప, ఏప్రిల్ 16: కరపలో పగలు కూడా వీధిలైట్లు వెలుగుతూ దర్శనమిస్తున్నాయి. స్థానిక కొత్తపేటవీధిలో గత వారం రోజులుగా పలు వీధిలైట్లు నిర్విరామంగా వెలుగుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పగటి పూట విద్యుత్ వృధాను అరికట్టాలని కోరుతున్నారు.



కరపలో పగలు వెలుగుతున్న వీధిలైట్లు

కూటమి అభ్యర్థులకు ఓటేస్తే అభివృద్ధికి బాట

» కాకినాడ సిటీ అభ్యర్థి వనమాడి కొండబాబు » పలుచోట్ల కూటమి అభ్యర్థుల ప్రచారం





కాకినాడలో ఓట్లు అభ్యర్థిస్తున్న కొండబాబు, సామర్లకోట: రాజప్పకు మహిళల మంగళహారతులు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 16: కూటమి అభ్యర్థుల సైకిల్, గ్లాస్ గుర్తులకు ఓటేస్తే కాకినాడ నగర అభివృద్ధికి బాట వేసినట్లవుతుందని, వైసీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేస్తే కాకినాడ నగరం గంజాయి, డ్రగ్స్‌కు అడ్డాగా మారుతుందని సిటీ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక 8వ డివిజన్ కొత్త కాకినాడ ప్రాంతంలో మంగళవారం ఆయన పర్యటించి టీడీపీ కూటమి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వివరించే సూపర్ సిక్స్ కరపత్రాలను ప్రజలకు అందజేశారు. కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి ఐదేళ్లుగా నగర అభివృద్ధిని విస్మరించి, అక్రమ సంపాదనే ధ్యేయంగా పాలన సాగించి భూకబ్జాలకు, రౌడీలకు, గుండాలకు, గంజాయి డ్రగ్స్‌కు అడ్డాగా మార్చాడన్నారు. వైసీపీ దోపిడీ పాలనతో నగరంలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ సుంకర పావని తిరుమలకుమార్, డివిజన్ నాయకులు సీకోటి అప్పలకొండ, ఎంఏ తాజుద్దీన్, మమతా శ్రీనివాస్, ఎండీ గౌస్, సీలం శ్రీనివాస్, బడే సత్యారావు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సామర్లకోట: రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన పాలన టీడీపీ-జనసేన-బీజేపీతో కూటమితోనే సాధ్యమని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. సామర్లకోట మండలం మాధవపట్నంలో మంగళవారం రాత్రి కూటమి పార్టీల నాయకులు ఇంటింటా ప్రచారాన్ని ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, మండల టీడీపీ నాయకుల అద్వర్యంలో నిర్వహించారు. రాజప్ప మాట్లాడుతూ కూటమిని చూసి సీఎం జగన్ భయపడుతున్నారన్నారు. తమ ప్రభుత్వంలో మహిళల కోసం కలలకు రెక్కలు కార్యక్రమాన్ని కచ్చితంగా అమలు చేస్తామన్నారు. ఎన్నికల్లో కూటమిని గెలిపించాలన్నారు. పలు కూడలి ప్రాంతాల్లో నాయకులకు మహిళలు మంగళహారతులు అందించి నీరాజనాలు పలికారు. జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు, బీజేపీ నాయకులు విత్తనాల వెంకటరమణ, నిమ్మకాయల రంగనాగ్, తోటకూర శ్రీనివాస్ పాల్గొన్నారు.



తొండంగి: ప్రచారం నిర్వహిస్తున్న దివ్య

తొండంగి: గొర్సపాలెం గ్రామంలో తుని కూటమి అభ్యర్థి యనమల దివ్య ఇంటింటి ప్రచా రం నిర్వహించారు. రానున్నది ఉమ్మడి ప్రభుత్వమేనని కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేసి తన విజయానికి దోహదపడాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మోతుకూరి వెంకటేష్, సుర్ల లోవరాజు, చింతంనీడి అబ్బాయి, యనమల రాజేష్, చొక్కా అప్పారావు, అరిగెల నర్సింహమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్: వైసీపీ నేతల కల్లుబొల్లి మాటలు నమ్మవద్దని, ఐదేళ్లు కనబడకుండా నేడు ఓట్లు కోసం వస్తున్న ఆ పార్టీ అభ్యర్థిని నిలదీసి ప్రశ్నించాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సూచించారు. పిఠాపురంలోని 13,17వార్డులు, గొల్లప్రోలు మండలం కొడవలిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ప్రజలకు కరపత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల ఓట్లును గాజుగ్లాసు గుర్తుపై వేయాలని సూచించారు.

సర్పవరం జంక్షన్: రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి,మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి అన్నారు. కాకినాడ రూరల్ కూటమి అభ్యర్థి పంతం నానాజీ, ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లకు మద్దతుగా మూడో డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. టీడీపీ కో కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, రంబాల వెంకటేశ్వరరావు,మదుబాల ఉన్నారు.

ఏలేశ్వరం: షిర్డినగర్‌లో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ కుమార్తె మాధురి ఇంటింటికీ వెళ్లి కూటమి కరప్రతాలు పంచుతూ సైకిల్ గుర్తుపై ఓటువేసి తల్లి సత్యప్రభను, గాజు గ్లాసుపై ఓటువేసి తంగెళ్ల శ్రీనివాస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, అలమండ చలమయ్య, టీడీపీ నాయకులు జ్యోతుల పెదబాబు, బస్వా ప్రసాద్, చిక్కాల లక్ష్మణరావు, రాసంశెట్టి వీర వెంకట్రావు, పాండ్రంకి అప్పారావు, బూర్లు సత్తిబాబు పాల్గొన్నారు.

జగ్గంపేట: కాట్రావులపల్లిలో బీసీ నేతలతో జయహో బీసీ ఎన్నికల ప్రచారం బీసీ సెల్ అధ్యక్షుడు తాళ్ళూరు సర్పంచ్ శిలామంతుల వీరబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. జ్యోతుల నెహ్రూను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. శిలామంతుల వీరబాబు, తంగెళ్ల అప్పారావు, బొండా శ్రీనుబాబు, వేగి సత్తిబాబు, వేలంక సర్పంచ్, శృంగరాయపాలెం సర్పంచ్ పట్టు చంటిబాబు, కూసుమంచి సత్యనారాయణ, జల్లారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి: సూరంపాలెంలో జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కోడలు జ్యోతుల లక్ష్మీదేవి ఇంటింటా టీడీపీ ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటేసి నెహ్రూను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కుంచే రాజా, కుంచే రామకృష్ణ, పోసిన బాబురావు, సూరంపాలెం బాలు, గల్లా కృష్ణ, అల్లం అబ్బు, దేవన వీరబాబు తదితరులున్నారు.

కిర్లంపూడి: జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూను గెలిపించుకోవాలని ఆయన కుమార్తె తోట సునీత గెద్దనాపల్లిలో మాజీ సర్పంచ్ సూరిశెట్టి వెంకటశివ, మాజీ ఎంపీటీసీ బీశెట్టి సూరిబాబు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తోట సర్వారాయుడు, తూము కుమార్, కుర్ల చినబాబు, చదరం చంటిబాబు, మొల్లేటి గంగాధర్, బుర్రి శ్రీను, పెద్దింశెట్టి మల్లారావు, గుడాల చిట్టిబాబు, దొడ్డిపట్ల బుజ్జి, జ్యోతుల సత్యమూర్తి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

ప్రత్తిపాడు/రౌతులపూడి ఏప్రిల్ 16: వైసీపీ అరాచక పాలనను భూస్థాపితం చేసేందుకు పార్టీలోకి నూతనంగా చేరేవారు నడుం కట్టాలని ప్రత్తిపాడు టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా కోరారు. మంగళవారం నియోజకవర్గంలోని చింతలపూడికి చెందిన మాజీ ఎంపీపీ ఇతంశెట్టి సూర్యభాస్కరరావు ఆధ్వర్యంలో 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరాయి. వారికి స్థానిక పార్టీ కార్యాలయం వద్ద సత్యప్రభ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. చేరినవారిలో పైలా సూరిబాబు, చిటికెల బాబు, గవిరెడ్డి అప్పలనాయుడు, డొంకా సత్తిబాబు, రౌతు చినబాబు ఉన్నారు. రౌతులపూడి మండలం ఎస్.పైడిపాలెనికి చెందిన గొల్లు పెద్ద దివానం, ఈగల సత్తిబాబు ఆధ్వర్యంలో 50 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. దవ్వా సుబ్రహ్మణ్యం, గొల్లు రామకృష్ణ, కాళ్ళ శ్రీనివాస్, గవిరెడ్డి రాము, బొంత సత్యనారాయణ, బాలోజు మహాలక్ష్మి, పి. స్వామి,గొంప శ్రీను, తాతపూడి సత్తిబాబు, కె. గణేష్, కె.త్రిమూర్తులు పార్టీలో చేరినవారిలో ఉన్నారు.

కాకినాడ సిటీ: స్థానిక 10వ డివిజన్ దుమ్ములపేటనుంచి పెద్దసంఖ్యలో టీడీపీలో చేరికలు జరిగాయి. స్థానిక వైసీపీ నాయకుడు మల్లె నూకరాజు పెద్దసంఖ్యలో తన అనుచరులు, కుటుంబసభ్యులతో డివిజన్ టీడీపీ నాయకుడు చోడిపిల్లి సతీష్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. కాకినాడ సిటీ ఉమ్మడి అభ్యర్థి వనమాడి కొండబాబు వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. డివిజన్ టీడీపీ నాయకులు మేరుగు రాజన్న, సూరాడ సత్యం, అనుసూరి శ్రీనివాస్, కొయ్య తాతారావు, వాసుపల్లి సంతోష్‌కుమార్, మోసా అప్పన్న పాల్గొన్నారు.

సామర్లకోట: సామర్లకోట మండలం బోయినపూడికి చెందిన తదితర 50 మంది కార్యకర్తలు మంగళవారం రాత్రి టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, టీడీపీ మండల కమిటీ నాయకులు తోటకూర శ్రీనివాస్, కుర్రా నారాయణస్వామిల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబులు హాజరయ్యారు. పార్టీలోకి చేరిన ఐదుగురుపంచాయతీ సభ్యులు ఎస్.రాజు, గురజాపు వీర్రాజు, మారిన దొరబాబు, మారిన ఏసు, చల్లా రమణలతో పాటు మరో 50 మంది అనుచరులకు పార్టీ కండువాలు కప్పారు.

తుని రూరల్: వైసీపీకి చెందిన పరవాడ తాత బాబుతో పాటుగా పలు కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. వారికి రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు తేటగుంట టీడీపీ కార్యాలయంలో టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో కుక్కడపు సునీల్,



ప్రత్తిపాడులో టీడీపీలో చేరినవారితో సత్యప్రభ

పరవాడ రాజా కృష్ణ, రాజేంద్ర భాస్కర్, బత్తుల నాగేశ్వరరావు, దాసరి నూకయ్యశెట్టి, పరవాడ దాలి నాయుడు, చిట్టిబాబు, శ్రీహరి, పలు కుటుంబాలు ఉన్నాయి. కార్యక్రమంలో టీడీపీ యువనేత యనమల రాజేష్, సుర్ల లోవరాజు, కుసుమంచి సత్యనారాయణ, సుకుమంచి శోభారాణి, చింతమనీడి అబ్బాయి, దంతులూని శ్రీనివాసరాజు, రాంబాబు రాజు, చందక గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



తుని రూరల్: టీడీపీలోకి ఆహ్వానిస్తున్న యనమల

'రేపు నామినేషన్ల స్వీకరణ'

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 16: శాసనసభ సాధారణ ఎన్నికల నేపథ్యంలో కాకినాడ సిటీ నియోజకవర్గంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని కాకినాడ సిటీ నియోజకవర్గ ఆర్వో జె.వెంకటరావు తెలిపారు. ఈ నెల 18న ఉదయం 11 గంటల నుంచి అసెంబ్లీ అభ్యర్థులు నామినేషన్లు స్వీకరించనున్నారు. నామినేషన్ల దాఖలుకు వచ్చేవారికి సమాచారం ఇవ్వడంతోపాటు సందేహాలు నివృత్తి చేసేలా శారదాదేవి గుడి వద్ద గల నగర పాలకసంస్థ కార్యాలయంలో మంగళవారం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థుల సౌకర్యార్థం నామినేషన్ కేంద్రాల్లో ఈ హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు. నామినేషన్ కేంద్రానికి 100మీటర్ల దూరంనుంచి 3 వాహనాలనే అనుమతిస్తామన్నారు.

తనిఖీలు ముమ్మరం చేయాలి

పెద్దాపురం, ఏప్రిల్ 16: సార్వత్రిక ఎనికల నేపథ్యంలో నిర్దేశిత ప్రదేశాల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని అధికారులను నియోజకవర్గ ఆర్వో అధికారి, ఆర్డీవో జె.సీతారామారావు ఆదేశించారు. ఆర్డీవో కార్యాలయంలో ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ బృందాలతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఏదైనా పార్టీ అభ్యర్థి, పార్టీ కార్యకర్త ఎన్నికల సామాగ్రిని తీసుకువెళ్లే వాహనంలో రూ. 50వేల కంటే ఎక్కువ నగదు లభ్యమైతే, డ్రగ్స్, మద్యం, ఆయుధాలు పట్టుబడితే తక్షణమే వాటిని స్వాధీనం చేసుకోవాలన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు.

నిబంధనలు పాటించాలి

ప్రత్తిపాడు, ఏప్రిల్ 16: నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి, నిబంధనలు పాటించాలని నియోజకవర్గ ఆర్వో ఎ.శ్రీనివాసరావు చెప్పారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లప్రక్రియ ఈ నెల 18 నుంచి ప్రారంభమవుతుందన్నారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి ఎన్నికల కమిషన్ సూచించిన పత్రాలు అందజేయాలన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

కొత్తపల్లి, ఏప్రిల్ 16: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కొత్తపల్లి ఎంపీడీవో పి.వెంకటనారాయణ కోరారు. కొత్తపల్లి స్త్రీ శక్తి భవన్‌లో గ్రామస్తులకు ఓటు హక్కు వినియోగం, ప్రాధాన్యతపై ఆయన అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ మేడారపు సూర్యభాస్కర్, ఏపీఎం శ్రీధర్ పాల్గొన్నారు.

కటింగ్ రాజాగా మారిన జగన్

జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు



గొల్లప్రోలులో మాట్లాడుతున్న నాగబాబు

గొల్లప్రోలు, ఏప్రిల్ 16: సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకున్న జగన్ కటింగ్ రాజాగా మారాడని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు ఎద్దేవా చేశారు. గొల్లప్రోలులోని నూతనంగా ఏర్పాటు చేసిన జనసేన ఎన్నికల కార్యాలయాన్ని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజులతో కలిసి ఆయన మంగళవారం రాత్రి ప్రారంభించారు. నాగబాబు మాట్లాడుతూ అమ్మఒడి ద్వారా చదువుకునే పిల్లలకు రూ.15వేలు వంతున ఇస్తానని ప్రకటించిన జగన్ ఒకరికే రూ.15వేలు ఇచ్చారని, తర్వాత మరుగుదొడ్ల క్లీనింగ్‌కు వేయి, పాఠశాల నిర్వహణకు మరో వేయి కటింగ్ చేస్తున్నారని తెలిపారు. చేనేతలకు అందించే నేతన్న నేస్తం ద్వారా రూ.24వేలు అందిస్తున్నట్లు గొప్పలు చెబుతున్నా మిగిలిన పథకాలన్నింటిని రద్దు చేశారని చెప్పారు. జగన్‌కు కట్ చేయడం అలవాటు అని, ఈ కటింగ్ రాజా మనుషులకేమిటి ఖర్మ ఇసుకకు గుండు కొట్టేశాడని ఎద్దేవా చేశారు. తన జీవితంలో ఇంత నీచమైన, దరిద్రమైన పరిపాలనను చూడలేదని చెప్పారు. ఇటువంటి వాటిని పవన్ ప్రశ్నిస్తుంటే ప్యాకేజీ తీసుకుంటున్నాడని అంటున్నారని మండిపడ్డారు. పవన్ పిఠాపురంలోనే శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారని తెలిపారు. పవన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని సూచించారు. కార్యక్రమంలో జనసేన కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావు, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు కడారి తమ్మయ్యనాయుడు, గుండ్ర సుబ్బారావు, చిట్టా మధు తదితరులు పాల్గొన్నారు.

దళితులను మోసం చేసిన జగన్

పిఠాపురం: ఎస్సీల ఓట్లుతో గద్దెనెక్కిన జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత వారి నిధులనే దారిమళ్లించి దళిత సమాజాన్ని మోసం చేశారని కె.నాగబాబు ఆరోపించారు. పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో జరిగిన దళిత సోదరుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత యువత వ్యాపార రంగంలో రాణించి పదిమందికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని పవన్ ఆలోచిస్తారని తెలిపారు. వాకపల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో పలువురు దళితులు జనసేనలో చేరారు.

పిఠాపురంలో గులకరాళ్లుతో వర్మ వినూత్న నిరసన

పిఠాపురం, ఏప్రిల్ 16: పట్టణంలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ గులకరాళ్లతో వినూత్నరీతిలో నిరసన తెలిపారు. జగన్‌రెడ్డి చేస్తున్న డ్రామాలను ప్రజలకు వివరించారు. జగన్‌లాగా ఉత్తుత్తి దాడులు చేయించుకోవాలంటే గులకరాళ్లు అమ్మబడును అంటూ ప్రచారం సాగించారు. పట్టణంలోని 13,17వార్డుల్లో వర్మ మంగళవారం జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. జగన్‌రెడ్డిపై జరిగిన గులకరాయి దాడి డ్రామాను ప్రజలకు వివరించేందుకు వినూత్న పద్ధతిని ఎంచుకున్నారు. గులకరాయితో ఎవరైనా చనిపోతారా అంటూ ఎద్దేవా చేశారు. జగన్‌రెడ్డి డ్రామాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని వర్మ తెలిపారు. ఎన్నికల్లో 25-35సీట్లుకు మించి రావని తెలిసే గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కోడికత్తి డ్రామాలా సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి డైరెక్షన్‌లో గులకరాయితో దాడి చేయించుకుని డ్రామాను రక్తికట్టించారని, డ్రామాను చూసి ప్రజలందరు నవ్వుకుంటున్నారని తెలిపారు. భారీ పోలీసుబందోబస్తు మధ్య తిరిగే జగన్‌పై దాడి జరిగితే నిందితులను పట్టుకోలేని స్థితిలో పోలీసు యంత్రాంగం, డీజీపీ, కమిషనర్ ఉన్నారని విమర్శించారు. ఇటువంటి కల్పిత దాడులను ప్రజలు నమ్మబోరన్నారు. చంద్రబాబు, పవన్‌పై రాళ్ల దాడి జరిగితే ఇప్పటి వరకూ ఒక్క పోలీసు అధికారి స్పందించలేదని, అంటే జగన్‌పై దాడి జరిగితేనే జరిగినట్లా అని ప్రశ్నించారు. వారిపై దాడి చేసిన వారిని ఇప్పటి వరకూ ఎందుకు పట్టుకోలేదని వర్మ ప్రశ్నించారు.

'తెలుగు సాంస్కృతిక వైభవాన్ని తెలియజేయాలి'



మీగడకు ప్రశంసాపత్రం అందజేస్తున్న భాస్కరరావు

పోర్టుసిటీ (కాకినాడ), ఏప్రిల్ 16: నేటితరానికి తెలుగు సాంస్కృతిక వైభవాన్ని తెలియజేయాలని ఎన్టీఆర్ రంగస్థల పురస్కార గ్రహీత డాక్టర్ మీగడ రామలింగస్వామి అన్నారు. స్థానిక దంటు కళాక్షేత్రంలో యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో తెలుగు నాటక రంగ దినోత్సవం మంగళవారం రాత్రి నిర్వహించారు. దంటు సూర్యారావు స్మారక జీవితకాల నట పురస్కారాన్ని రామలింగస్వామికి అందించారు. ముఖ్యఅతిథిగా సరస్వతి గానసభ అధ్యక్షుడు కేవీఎస్ ఆంజనేయమూర్తి మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో నాటకరంగం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. సభకు యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కరరావు అధ్యక్షత వహించారు. క్లబ్ ప్రధాన కార్యదర్శి పీవీ రావు, కార్యదర్శి నాదెళ్ల ప్రభుదాస్, ఉపాధ్యక్షులు పట్నాల రాము,కేవీసీతారామ్, ఎం.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కపిరాజు నాటిక

తెలుగు నాటక రంగ దినోత్సవం పురస్కరించుకుని ప్రదర్శించిన కపిరాజు నాటిక విశేషంగా సభికులను ఆకట్టుకుంది. విజయవాడ న్యూస్టార్ మోడ్రన్ థియేటర్ ఆర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నాటిక ప్రదర్శన నిర్వహించారు. నాటికకు డాక్టర్ ఎంఎస్‌చౌదరి దర్శకత్వం వహించారు.

పోక్సో కోర్టు జడ్జికి ఘన సత్కారం



కాకినాడ క్రైం, ఏప్రిల్ 16: కడప జిల్లాకు బదిలీపై వెళుతోన్న కాకినాడ పోక్సో కోర్టు జడ్జి వెంకటేశ్వరరావును మంగళవారం కాకినాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. జడ్జి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తండ్రి కోరిక మేరకు నిరుపేదలకు న్యాయం అందించేందుకు న్యాయవాది వృత్తి చేపట్టి నేడు జడ్జిగా విధులు నిర్వహిస్తున్నానన్నారు. కాకినాడ బార్ అసోసియేషన్ సభ్యుల సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో 4వ జిల్లా జడ్జి లక్ష్మీనారాయణ, 6వ అదనపు జిల్లా జడ్జి ఆరోరా, సీనియర్ న్యాయవాదులు ఏలూరి సుబ్రహ్మణ్యం, మహ్మద్ జవహర్ ఆలీ, నరహరిశెట్టి రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

19న పంతం నానాజీ నామినేషన్

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 16: కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి జనసేన-టీడీపీ-బీజేపీ ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థిగా ఈనెల 19న నామినేషన్ వేయన్నుట్టు పంతం నానాజీ తెలిపారు. వలసపాకల గంగరాజునగర్ జనసేన పార్టీ కార్యాలయం నుంచి కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్ వద్ద తహశీల్దార్ కార్యాలయంలో గల ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తానని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

తిరుమాలి కాలనీలో అగ్ని ప్రమాదం

ఏలేశ్వరం, ఏప్రిల్ 16: ఏలేశ్వరం మండలం తిరుమాలి కాలనీలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.2లక్షలు ఆస్తి నష్టం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా గేదెల సూర్యనారాయణ అనే బాబూరావుకు చెందిన పాన్‌షాపు అగ్నికి ఆహుతైంది. ఫ్రిడ్జి, కూలరు పలు వస్తువులు కాలి బూడిదయ్యాయని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాబూరావు కోరారు. ప్రత్తిపాడు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు చుట్టుపక్కలకు వ్యాపించకుండా నియంత్రించారు.

అలరించిన భరత నాట్య ప్రదర్శన

పిఠాపురం, ఏప్రిల్ 16: పట్టణంలోని పాదగయ క్షేత్రంలో సాయి నటరాజ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో తిరుపతి, విశాఖపట్టణం ప్రాంతాలకు చెందిన కళాకారుల భరతనాట్య ప్రదర్శన ఆహూతులను అలరించింది. స్వయంభూ కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, పురుహూతికాఅమ్మవారి సన్నిధిలో ఉషశ్రీ, శ్రీనిత్య, వరణ్య, మహిత, శ్రియ, వాన్సిక, దామిని, పర్ణిత, ఆరాధ్య, హన్విత, దీపికలు నాట్య ప్రదర్శన ఇచ్చారు. గురువు డాక్టర్ పి.శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనుల పరిశీలన

సామర్లకోట, ఏప్రిల్ 16: సామర్లకోట ఏడీబీ రోడ్డు నుంచి అచ్చంపేట వరకూ నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారి 516ఎఫ్ పనులను ఎన్‌హెచ్ఏఐ ఉన్నతాధికారులు కృష్ణ తదితర బృందం మంగళవారం పరిశీలించారు. హుస్సేన్ పురం దళిత కాలనీ సమీపాన గోదావరి కాలువ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణపు పనులతో బాటు తాత్కాలిక రహదారి ఏర్పాట్లు పనులను అధికారుల బృందం పరిశీలించింది.

అంబేడ్కర్, ఫూలే విగ్రహాలకు నివాళి

జగ్గంపేట, ఏప్రిల్ 16: జగ్గంపేట ప్రాథమిక పాఠశాల వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాజ్యోతిరావు ఫూలే జయంతి ఉత్సవం పులిప్రసాద్ అధ్యక్షతన నిర్వహించగా ప్రధానోపాధ్యాయులు టీవీఎస్ రంగారావు ముఖ్య అతిథిగా హాజరై అంబేడ్కర్, ఫూలే విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు కృష్ణ మోహన్, పద్మజ, కె.ప్రతిభ, గంగాభవాని, కె.చినపాప, పి.ప్రేమచంద్, కేపీవీఎస్ సుబ్రహ్మణ్యం, పీఈటీ మురళి,అడపా పెద్దకాపు పాల్గొన్నారు.

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ

ఏలేశ్వరం, ఏప్రిల్ 16: త్రైత సిద్ధాంత శ్రీక్రోధి నామ సంవత్సర తెలుగు క్యాలెండర్‌ను మంగళవారం పట్టణంలో బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ఉమ్మిడి వెంకట్రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో దవులూరి పరమేశ్వరి, కీలు దేవి, దవులూరి సత్యనారాయణ,కీలు అన్నవరం పాల్గొన్నారు.

కెజిబివి విద్యార్థిని ప్రతిభ

తొండంగి, ఏప్రిల్ 16: వాకదారిపేట కెజిబివి విద్యార్థిని పక్కుర్తి కుసుమ ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలో జిల్లాలో గల 12 కెజిబివిలలోని విద్యార్థుల కంటే ఎక్కువ మార్కులు సాధించి ప్రతిభ కనబర్చినట్టు ఎస్‌వో రాజేశ్వరి తెలిపారు. సిఇసి గ్రూపులో 841 మార్కులు సాధించిందన్నారు. కుసుమను డీఈవో రమేష్ ప్రత్యేకంగా అభినందించారు.

అనుమతి లేని బాణసంచా నిలిపివేత

రౌతులపూడి, ఏప్రిల్ 16: అనుమతి లేని బాణసంచా, తీన్‌మార్‌ను ఎంపీడీవో ప్రేమసాగర్ నిలిపివేశారు. ఎస్.అగ్రహారంలో వైసీపీ నేత వరుపుల సుబ్బారావు గడప గడపకు కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక కార్యకర్తలు బాణా, తీన్‌మార్ సిద్ధంచేశారు.అనుమతిలేదని ఎంపీడీవో నిలిపివేశారు.

రక్తదాన శిబిరం

గండేపల్లి, ఏప్రిల్ 16: సూరంపాలెంలోని ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, ప్రగతి రోటరాక్ట్‌క్లబ్, ఇండియన్‌రెడ్‌క్రాస్‌సొసైటీ కాకినాడ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు, 75 మంది రక్తదానం చేశారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ పి.కృష్ణారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.